
సాక్షి
ఒడిశా
ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,19,621లు, బంగారం 1గ్రాము 230 మిల్లీగ్రాములు, వెండి 30 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఎమ్మెల్యేల సస్పెన్షన్‌పై బీజేపీ ఆందోళన

ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఇద్దరిని ఈ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడంపై శనివారం అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు ఆందోళనలు చేపట్టారు.

- 8లో



సత్కారాలు బాధ్యతలు పెంచుతాయి

సత్కారాలు ప్రతి ఒక్కరికీ బాధ్యతలు పెంచుతాయని రాజ్యసభ సభ్యుడు ముజిబుల్లా ఖాన్ (మున్నా భాయి) అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

గ్యాంగ్‌స్టర్ హత్య కేసులో ఇద్దరు అరెస్టు



అరెస్టు చేసిన నిందితులను తీసుకెళ్తున్న పోలీసులు

బరంపురం: గంజాం జిల్లా అస్కాకి చెందిన గ్యాంగ్‌స్టర్ సునీల్ నాహక్ హత్య కేసులో ఇద్దరు వ్యక్తులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సునిల్ నాహక్‌పై పాత కక్షలతో కుదలా పోలీసుస్టేషన్ పరిధి ధర్మగడ గ్రామంలో ప్రత్యర్థులు మారణాయుధాలతో దాడిచేసి హత్య చేశారని తెలియజేశారు. అయితే హత్య చేస్తున్న వీడియో, ఫొటోలు వైరల్ కావడంతో నేరస్తును గుర్తించడం సులభమైనట్లు పేర్కొన్నారు. వాటి ఆధారంగా జితు ప్రధాన్, దీపక్ కుటియా అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారిలో కోర్టులో హాజరుపరిచి అస్కా జైలుకి తరలించారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం



సీజ్ చేసిన ట్రాక్టర్లు

రాయగడ: ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ శాఖ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా స్థానిక జంఝావతి, నాగావళి నదుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై కొరడా ఝులిపిస్తున్నారు. తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి, అదనపు తహసీల్దార్ పరశురాం భత్రలు విరివిగా దాడులను నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన దాడుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న 5 ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు. స్థానిక సిరిగుడ, బెహరగుడ, రాణిగుడఫారం తదితర ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు, దాడులు నిర్వహించి ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అనంతరం ప్రతీ ట్రాక్టర్‌కు రూ.12,500 అపరాధ రుసుము విధించారు.


త్రుటిలో తప్పిన ప్రమాదం



ఒకవైపుకు ఒరిగిపోయిన బస్సు

బరంపురం: స్థానిక బంజనగర్–మోహన రహదారిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. శనివారం ఉదయం 6 గంటల సమయంలో గజపతి జిల్లా మోహన నుంచి 40 మంది ప్రయాణికులతో మహావీర్ బస్సు బరంపురం బయల్దేరింది. ఉదయం తీవ్రంగా మంచు కురవడంతో రహదారి కనిపించక ఘాటి దగ్గర పట్టపూర్ పోలీసుస్టేషన్ పరిధి కెమండి కాలువ బ్రిడ్జి గట్టుని ఢీకొని లోయలో ఒకవైపుకు ఒరిగిపోయింది. సమాచారం అందుకున్న పట్టపూర్ పోలీసులు మరియు అగ్నిమాపక సిబ్బంది చేరుకొని బస్సులో ఉన్న 40 మంది ప్రయాణికులను రక్షించారు. బస్సును బయటకు తీసుకొచ్చేందుకు సుమారు 3 గంటల సమయం పట్టడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మాజీ మేయర్‌పై బాంబు దాడి



బాంబు దాడితో పగిలిన కారు అద్దాలు



శిబశంకర్ దాస్

బరంపురం: బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ శిబశంకర్ దాస్‌పై ప్రత్యర్థులు బాంబు దాడిచేసి పరారైన ఘటన నగరంలో సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం రాత్రి గుసానినువగాంలోని బొడొవీధిలో ఉన్న తన స్వగృహానికి మాజీ మేయర్ శిబశంకర్ దాస్ కారులో వస్తున్న సమయంలో దుండగులు కారుపై బాంబు విసిరి పరారయ్యారు. బాంబు పేలడంతో కారు అద్దాలు విరిగిపోయాయి. శిబశంకర్ దాస్‌కి ఎటువంటి గాయాలు అవ్వలేదు. టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్క్రబ్ టైఫస్ టెర్రర్



సుందర్‌గడ్ జిల్లా ప్రధాన వైద్యాధికారి కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర బృందం

- పలు జిల్లాల్లో విజృంభిస్తున్న వ్యాధి
- తాజాగా 20 కేసులు నమోదు
- కేంద్ర నిపుణుల బృందం సమీక్ష



భువనేశ్వర్: రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ సంక్రమణ గణనీయంగా విస్తరిస్తోంది. ప్రధానంగా సుందర్‌గడ్ జిల్లాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ జిల్లాలో తాజాగా 20 మందిలో ఈ రోగం నిర్ధారించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో స్క్రబ్ టైఫస్ పరిస్థితిని సమీక్షించడానికి కేంద్రం నుంచి ప్రత్యేక నిపుణుల బృందం విచ్చేసింది. ఈ బృందం శనివారం సుందర్‌గడ్ జిల్లా సందర్శించింది. రాష్ట్రానికి చెందిన ఇద్దరు వైద్య నిపుణులతో కూడిన మరో బృందం స్క్రబ్ టైఫస్ సంక్రమణ పరిస్థితిని సమీక్షించేందుకు బర్‌గడ్ జిల్లా సందర్శించింది. ఈ జిల్లాలో స్క్రబ్ టైఫస్ సంక్రమణ ప్రాణాంతకంగా పరిణమించినట్లు ఈ బృందం సమీక్షలో ప్రాథమికంగా ఖరారైనట్లు సమాచారం.

కేంద్ర పరిశీలన బృందం

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లోని ముఖ్యంగా పశ్చిమ ఒడిశాలో ప్రాణాంతకమైన స్క్రబ్ టైఫస్ వ్యాప్తిని నివారించడానికి వైద్యారోగ్య అధికారులు సన్నద్ధమవుతున్నారు. సుందర్‌గడ్ జిల్లాలో ఈ రోగుల సంఖ్య 292కి చేరింది. ఈ పరిస్థితి క్షేత్రస్థాయిలో సమీక్షించేందుకు న్యూఢిల్లీ లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ సమీర్ గులాటీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీ నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ తుషార్ ఎన్.నాలే, న్యూఢిల్లీ నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ (మైక్రోబయాలజీ) డాక్టర్ ధరా షాతో కూడిన కేంద్ర బృందం జిల్లా ప్రధాన వైద్యాధికారి (సీడీఎంఓ) కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించింది.

జనవరిలో మొదటి కేసు నమోదు

ఈ ఏడాది జనవరిలో సుందర్‌గడ్ జిల్లాలో మొదటి స్క్రబ్ టైఫస్ కేసును గుర్తించారు. అనంతరం ఇన్‌ఫెక్షన్ రేటు క్రమంగా తగ్గింది. అయితే ఆగస్టు తర్వాత కేసుల సంఖ్య మరలా పెరుగుతోంది. స్క్రబ్ టైఫస్ సోకిన చిగ్గర్స్ (లార్వా మైట్స్) కాటు ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. వ్యాధి అత్యంత సాధారణ లక్షణాలు జ్వరం. చిగ్గర్ కాటు వల్ల చర్మంపై 'ఎస్కార్' అని పిలువబడే దురద, ఎరబ్రడిన గడ్డలు ఏర్పడడం రోగ లక్షణాలుగా సమీక్ష బృందం పేర్కొంది. వ్యవసాయ భూములు లేదా అటవీ ప్రాంతాలను తరుచుగా సందర్శించే వ్యక్తులు సంక్రమణకు గురవుతారు. ఇది అంటువ్యాధుల్లో ఒకటి. చికిత్స చేయకుండా వదిలేస్తే ఇది ప్రాణాంతక పరిణామాలను కలిగిస్తుందని వివరించారు. రాష్ట్రంలో పెరుగుతున్న స్క్రబ్ టైఫస్ కేసులను పరిష్కరించడానికి జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవియాకు లేఖ రాసిన నేపథ్యంలో కేంద్ర బృందం పర్యటనకు వచ్చినట్లు సమాచారం. ఈ సందర్భంగా వైద్య సామాగ్రి మరియు అవగాహన ప్రచారాల కోసం అదనపు నిధులు కేటాయించాలని ధర్మేంద్ర మాండవ్యను కోరారు.

సుందర్‌గడ్‌లో 20 తాజా కేసులు

సుందర్‌గడ్ జిల్లాలో శనివారం మరో 20 మందిలో స్క్రబ్ టైఫస్ పాజిటివ్ ధ్రువీకరించారు. పరీక్షకు పంపిన 74 రక్త నమూనాలలో 20 పాజిటివ్‌గా తేలిందని జిల్లా ప్రధాన వైద్యాధికారి (సీడీఎంవో) కాన్హుచరణ్ నాయక్ తెలిపారు. తాజా కేసులతో జిల్లాలో మొత్తం ఇన్ఫెక్షన్ల సంఖ్య 292కి చేరింది. జిల్లాలో స్క్రబ్ టైఫస్ పరీక్ష సౌకర్యాలు రెండు ప్రదేశాలు రూర్కెలా ప్రభుత్వ ఆస్పత్రి మరియు సుందర్‌గడ్ జిల్లా ప్రధాన కార్యాలయ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి.

పూరీ జిల్లాలో పాజిటివ్ కేసులు

పూరీ జిల్లాలో సెప్టెంబర్‌లో 58 మందిలో స్క్రబ్ టైఫస్ పాజిటివ్ ఖరారైందని జిల్లా ప్రధాన వైద్యాధికారి మరియు ప్రజారోగ్య శాఖ అధికారి (సీడీఎంవో, పీహెచ్‌వో) డాక్టర్ బిరజా శంకర్ రథ్ తెలిపారు. 358 రక్త నమూనాలను పరీక్షించగా 58 స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా తేలినట్లు వివరించారు. జిల్లాలో స్క్రబ్ టైఫస్‌పై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే జిల్లాలో స్క్రబ్ టైఫస్ కారణంగా ఎటువంటి మరణాలు సంభవించలేదని ఆయన తెలిపారు.

గుట్కా కర్మాగారంపై దాడులు



స్వాధీనం చేసుకున్న గుట్కా సామగ్రి బస్తాలు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

బరంపురం: నగర శివారు హల్దియాపదర్–రలబ మధ్య రహదారిలో ఉన్నటువంటి నకిలీ గుట్కా కర్మాగారంపై పోలీసులు దాడిచేసి భారీగా గుట్కా సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ బిపిన్ రంజన్ బెహరా తెలిపిన వివరాల మేరకు.. గోశంతరా పోలీసుస్టేషన్ పరిధి హల్దియాపదర్–రలబ మధ్య రహదారి సమీపంలో కొద్దికాలంగా రహస్యంగా నకిలీ గుట్కా కర్మాగారం నడుస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్పీ సార్వణ్ వివేక్ ఆదేశంతో పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి శనివారం మధ్యాహ్నం గుట్కా కర్మాగారంపై దాడి చేశారు. గుట్కా సామగ్రి, లేబుల్స్ మరియు యంత్రాలు స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో నిరంజన్ ప్రధాన్, రామచంద్ర దాస్, కె.శ్రీరాములు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

సత్తాచాటిన సెంచూరియన్ వర్సిటీ అధ్యాపకుడు



చెక్కు అందుకుంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ దాస్ తదితరులు

పర్లాకిమిడి: సెంచూరియన్ వర్సిటీలో అగ్రికల్చర్, బయో ఇంజినీరింగ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా.ప్రత్యూష్ కుమార్ దాస్ సెప్టెంబర్ 27వ తేదీన భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఇన్నొవేషన్ ఛాలెంజ్ పోటీల్లో సత్తాచాటాడు. వరి పంటలో 'పాలిమెర్ ఫంక్షనైజ్డ్ బయో బెడ్స్ మరియు సారవంతమైన మట్టి సంస్కరణలు (పీబీఈఏ)' పరిశోధనకు గానూ ఆయన బృందానికి తృతీయ బహుమతి లభించినట్లు డీన్ ఎం.దేవేందర్ రెడ్డి తెలియజేశారు. అమె ఒడిశా ముఖ్య కార్యదర్శి అసీత్ కుమార్ త్రిపాఠి చేతుల మీదుగా డాక్టర్ ప్రత్యూష్ కుమార్ దాస్ బృందం రూ.10 వేలు చెక్కు అందుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకుడికి సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు, ఎం.ఎస్.స్వామినాథన్ వ్యవసాయ విద్యాలయం డీన్ ఎం.దేవేందర్‌రెడ్డి, డీన్ (అకాడమిక్) డాక్టర్ ఎస్పీ నందా, అసోసియేట్ డీన్ ప్రొ.అనిల్ కుమార్, డైరెక్టర్ (అడ్మిషన్స్) డా.దుర్గాప్రసాద్ పాఢి, ఎం.సుబ్రహ్మణ్యం, డా.పి.కల్యాణ చక్రవర్తి తదితరులు అభినందనలు తెలిపారు.

బీడీవో కార్యాలయం ముట్టడి



ఆందోళన చేస్తున్న అంతా పంచాయతీ ప్రజలు



పీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జయపురం: సమితిలోని అంతా గ్రామ పంచాయతీలో చోటుచేసుకుంటున్న అక్రమాలకు నిరసనగా ఆ పంచాయతీ ప్రజలు కొరాపుట్ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బీడీవో కార్యాలయాన్ని శనివారం ముట్టడించారు. యూత్ ఆర్గనైజేషన్ ఆర్గనైజర్ రవీంద్ర మహాపాత్రో నేతృత్వంలో చేపట్టిన ఈ ఆందోళనలో ప్రజా సమస్యలు, అంతా పంచాయతీలో జరుగుతున్న అక్రమాలపై బీడీవోను సంభోదిస్తూ రాసిన లేఖను పీఈవో తరణీ త్రిపాఠీకి అందజేశారు. గ్రామంలోని లబ్ధిదారులకు పింఛన్లు అందడం లేదని ఆరోపించారు. పింఛన్ డబ్బుల కోసం గత ఆరు నెలలుగా ఎదురుచూసి కొంతమంది మరణించారని తెలియజేశారు. లబ్ధిదారులకు కేటాయించిన నిధులు ఏమయ్యాయో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ వెంటనే డబ్బులు అందజేయాలని కోరారు. అదేవిధంగా అర్హులైన అనేక మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా, మంజూరవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు లేకపోవడం వలన వారు ప్రభుత్వ ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారని వాపోయారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులందరికీ మేలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ప్రకృతి వైపరీత్యాలపై సన్నద్ధత అవసరం



ప్రకృతి వైపరీత్యాలపై సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొంనేందుకు సన్నద్ధత అవసరమని సమితి అధికారులు ప్రభుత్వ సిబ్బందిని ఆదేశించారు. సమితి సభాగృహంలో ప్రకృతి ప్రమాదాల పర్యవేక్షణ కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రకృతిపరమైన ప్రమాదాలు సంభవిస్తే ఎలా వాటిని ఎదుర్కోవాలో చర్చించారు. ప్రకృతి వైపరీత్యాల వలన ఒక్క వ్యక్తి కూడా మరణించకూడదని, దీనికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ స్థాయి నుంచి సమితి స్థాయి వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీ స్థాయిలో కమిటీలు పీఈవో నేతృత్వంలో ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. కమిటీలో జీఆర్వో, లైన్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు ఉంటారన్నారు. అలాగే సమితి స్థాయిలో బీడీవో నేతృత్వంలో ఏబీడీవో, జీపీఈవో, సమాజ సురక్షా అధికారి, సమితిలోని ఇతర అధికారులతో ఒక కమిటీ ఏర్పాటుకు నిర్ణయించింది. ఒకవేళ అగ్ని ప్రమాదాలు, వరదలు, తుపానులు, పిడుగులు, భూకంపాలు మొదలగు ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే కమిటీలు వెంటనే సహాయక చర్యలు చేపట్టాలన్నారు. కమిటీలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన పేకాటరాయుళ్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి పోలీసుస్టేషన్ పరిధిలో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ ఇంటిపై దాడిచేసి పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఏడు బైక్‌లు, రూ.12 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు మత్తిలి ఐఐసీ దేవ్‌దత్ మల్లిక్ శనివారం తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

353 కేజీల గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి బహుదూర్‌గూడ అడవిలో శనివారం మత్తిలి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. అయితే ఆ సమయంలో బహుదూర్‌గూడ అడవి నుంచి గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో విస్తృతంగా గాలించారు. పోలీసులను చూసిన గంజాయి మాఫియా వ్యక్తులు 13 బస్తాల్లో గంజాయిని విడిచిపెట్టి పరారయ్యారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, నిందితుల కోసం గాలిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న 353 కేజీల గంజాయి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని తెలిపారు.

పితృపక్షం ఆరంభం

భువనేశ్వర్: అశ్విని మాసం కృష్ణ పక్షం ప్రతిపద తిథి పురస్కరించుకుని శనివారం నుంచి పితృపక్షం ప్రారంభమైంది. ఇక నుంచి పూరీ పుణ్యక్షేత్రంలో వివిధ పుష్కరిణీలు, కొలనులు, శ్రీమందిరం పరిసరాల్లో క్రమంగా రద్దీ పెరుగుతుంది. ఈ పక్షంలో పితృ దేవతలకు తర్పణం, పిండ ప్రదానం చేయడం ఆచారం. శనివారం ఉదయం నుంచి పూరీలో వివిధ పవిత్ర పుష్కరిణులతో మహోదధి తీరంలో రద్దీ కనిపించింది. పక్షం రోజుల పాటు పితృ దేవతలకు తర్పణం చేసే నియమం ఉండగా, వచ్చే మహాలయ అమావాస్య వరకు ఈ ఆచారం కొనసాగుతుంది.

తాత్కాలిక సీజేగా జస్టిస్ షడంగి



జస్టిస్ బి.ఆర్.షడంగి

భువనేశ్వర్: ఒడిశా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ బిద్యుత్ రంజన్ షడంగి నియమితులయ్యారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదంతో ఈ నియామకం జరిగింది. న్యాయ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శుభాసిష్ తలపాత్ర పదవీ విరమణ చేసిన తర్వాత షడంగి బాధ్యతలు చేపడతారు. జస్టిస్ తలపాత్ర 33వ ప్రధాన న్యాయమూర్తిగా ఆగస్టు 8న ప్రమాణ స్వీకారం చేశారు. 2 నెలల కంటే తక్కువ కాలం ఆయన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. ఈనెల 3వ తేదీన జస్టిస్ శుభాసిష్ తలపాత్ర పదవీ విరామం పొందుతారు. మర్నాడు అక్టోబర్ 4 నుంచి ఆయన స్థానంలో జస్టిస్ బిద్యుత్ రంజన్ షడంగి తాత్కాలిక న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహిస్తారని కేంద్ర న్యాయ శాఖ జారీ చేసిన ఉత్తర్వులు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఆయన హైకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు.

జస్టిస్ షడంగి ప్రస్థానం

జస్టిస్ షడంగి 1962వ సంవత్సరం జూలై 20న జన్మించారు. స్వస్థలం నయాగర్ జిల్లా ఒడొడగాంవ్ పంటిఖరిసాసన్ గ్రామం. భువనేశ్వర్ బీజేబీ కళాశాల నుంచి కామర్స్‌లో పట్టభద్రులయ్యారు. ఉత్కళ విశ్వవిద్యాలయం అధీనం కటక్ మధుసూదన్ లా కళాశాల నుంచి న్యాయశాస్త్రంలో ఉత్తీర్ణత సాధించారు. అనంతరం సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ పొందారు. ఒడిశా హైకోర్టు మరియు సుప్రీంకోర్టులో రెగ్యులర్ ప్రాక్టీస్ చేశారు. 1985 సంవత్సరం డిసెంబర్‌లో న్యాయవాదిగా సభ్యత్వం పొందారు. ఒడిశా హైకోర్టు బార్ అసోసియేషన్, సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్, క్రిమినల్ కోర్ట్ బార్ అసోసియేషన్ మరియు సెంట్రల్ ట్రిబ్యునల్ బార్ అసోసియేషన్‌లో జీవితకాల సభ్యుడిగా నమోదయ్యారు. అతను అనేక ముఖ్యమైన విషయాల్లో కోర్టుకు సహాయం చేయడానికి ఆర్బిట్రేటర్, అడ్వకేట్ కమిషన్ మరియు ఆమికస్ క్యూరీగా బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు. 2013 జూన్ 20న ఒడిశా హైకోర్టు నియమిత న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు.

పట్టుబడిన పెట్రోల్ దొంగలు



అరెస్టైన పెట్రోల్ దొంగలను చూపిస్తున్న పోలీసులు

జయపురం: స్థానిక పారాబెడ ప్రాంతంలో కొద్ది రోజులుగా పెట్రోల్ దొంగలు విజృంభిస్తున్న విషయం తెలిసిందే. అయితే పెట్రోల్ దొంగలిస్తున్న వ్యక్తులు, ఆ పెట్రోల్ కొంటున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి సత్యానంద పాత్రో శనివారం తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాలు మేరకు.. జయపురం పట్టణ పోలీసుస్టేషన్ పరిధి పారాబెడ ప్రాంతంలో బైక్‌లలో పెట్రోలు దొంగిలిస్తున్న నలుగురు దొంగలను అరెస్టు చేశామని వెల్లడించారు. వారితో పాటు వారు దొంగిలించిన పెట్రోలు కొంటున్న క్రిస్టియన్‌పేట శివ ఖొర(30)ను అరెస్టు చేసినట్లు తెలియజేశారు. నిందితుల నుంచి 8 లీటర్ల పెట్రోలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పారాబెడలో బాగా చీకటిపడిన సమయాల్లో ఇళ్లముందు ఉంచిన బైక్‌లలో ఉన్న పెట్రోలు ఉదయానికి లేకపోవడంతో సందేహించి, సరోజ్ కుమార్ సాహు అనే వ్యక్తి తన ఇంటి ముందు సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ సీసీ కెమేరాల్లో పెట్రోలు దొంగిలిస్తున్న ముగ్గురును గుర్తించడం జరిగిందని, వారితో పాటు పెట్రోలు దొంగతనంలో సంబంధం ఉన్న మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసుని పోలీసు ఏఎస్ఐ విష్ణుచరన్ మడకామి దర్యాప్తు జరిపారని వెల్లడించారు. ఈ కేసులో అరెస్టైనవారు మైనర్లుగా పేర్కొన్నారు. వారిని కోర్టులో హాజరుపరచగా జడ్జి జామీను నిరాకరించడంతో మల్కన్‌గిరి మైనర్ ఖైదీల గృహానికి పంపించారు.

క్లుప్తంగా

నిష్పక్షపాతంగా విచారణ జరగాలి

● రాయగడ ఎస్పీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశం

భువనేశ్వర్: రాయగడ జిల్లాలో మూడో తరగతి చదువుతున్న చిన్నారిపై అత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. బాలిక చదువుతున్న పాఠశాల ప్యూన్ ఇటీవల పాఠశాలలో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. దీంతో ఈ సంఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితురాలికి న్యాయం చేయాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) రాయగడ పోలీసు సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. న్యాయె పంయి లొడెయి పారిబార్ సంస్థ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సుబ్రత్ కుమార్ దాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను హక్కుల కమిషన్ విచారణకు స్వీకరించిన అనంతరం రాయగడ జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీ చేసింది. ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు జరిగిన అన్యాయంపై రూ.50 లక్షల పరిహారం చెల్లించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని పిటిషనర్ తన పిటిషన్‌లో కమిషన్‌ను అభ్యర్థించాడు.

సీనియర్ పాత్రికేయుడు పాఢి ఇకలేరు



పాఢి (ఫైల్)

రాయగడ: సీనియర్ పాత్రికేయుడు పాఢి (87) శుక్రవారం రాత్రి కొరాపుట్ జిల్లా సిమిలిగుడలోని తన కుమారుడి ఇంట్లో తుదిశ్వాస విడిచారు. దీంతో ఆయన మృతదేహాన్ని అదేరోజు రాత్రి రాయగడ బ్రాహ్మణవీధిలోని సొంత ఇంటికి తీసుకొచ్చారు. అనంతరం తెల్లవారు 5 గంటలకు అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. పాఢికి నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఆయన మరణం విన్న స్థానిక పాత్రికేయులు బ్రహ్మణ వీధికి చేరుకుని నివాళులర్పించారు. అక్టోబర్ 2వ తేదీన స్థానిక సంస్కృతి భవనంలో ఆయన సంతాప సభ నిర్వహించనున్నట్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రంజన్ కుమార్ రౌథొ తెలియజేశారు.

అక్టోబర్ 2న కోర్టు స్వచ్ఛ హీ సేవా

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛ హీ సేవా కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పి.రాము తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి ప్రభుత్వ న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాద గుమస్తాలు హాజరు కావాలని కోరారు. అలాగే అదే రోజు గాంధీ జయంతి కార్యక్రమాన్ని కూడా బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహిస్తామన్నారు.

రగ్బీ పోటీలకు జిల్లా జట్ల పయనం



కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు పయనమైన జిల్లా జట్లు

టెక్కలి: కర్నూలులో ఏపీ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న 9వ జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీలకు అండర్-18 విభాగంలో బాల బాలికల జిల్లా జట్లు శనివారం పయనమయ్యాయి. ఈ సందర్భంగా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వారణాసి గోవిందరాజు, పొన్నాడ పార్వతీశంతో పాటు ప్రతినిధులు డి.రామకృష్ణ, బి.నారాయణరావు, కేకే రామిరెడ్డి తదితరులు జిల్లా జట్లకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మరోసారి వేణుగోపాలరావు



వేణుగోపాలరావును అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి పప్పల వేణుగోపాలరావు రెండో సారి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు శనివారం విజయవాడలోని రెవెన్యూ భవనంలో జరిగాయి. వేణుగోపాలరావు రెండోసారి ఎన్నిక కావడంపై జిల్లాకు చెందిన రెవెన్యూ ఉద్యోగులు పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సర్వీసుల సంఘం ప్రతినిధులు ఆయనను అభినందించారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

ఇచ్ఛాపురం రూరల్: చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. రూరల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఈదుపురంలో ఏర్పాటు చేసిన పోషణ మహా మహోత్సవ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ బోర పుష్ప, జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, కార్పొరేషన్ చైర్మన్లు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, లోకేశ్వరరావురెడ్డి, సీడీపీవో పురాణం నాగరాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల సస్పెన్షన్‌పై బీజేపీ ఆందోళన

● అసెంబ్లీ వెల్‌లోకి దూసుకెళ్లిన ఎమ్మెల్యేలు
● సాయంత్రం 4 గంటలకు వరకు వాయిదా



స్పీకర్ పోడియం చుట్టుముట్టిన విపక్ష సభ్యులు

భువనేశ్వర్: స్పీకర్‌ను అగౌరవపరిచారని ప్రతిపక్ష బీజేపీ చీఫ్ విప్ మోహన్ మాఝీ, ముఖేష్ మహలింగ్‌ను గురువారం శాసనసభ నుంచి ఈ విడత సమావేశాలు అయ్యేవరకు సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీ సభ్యులు సభలో శనివారం తీవ్ర గందరగోళం సృష్టించడంతో సభా కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితులను చక్కదిద్దేందుకు సభా కార్యక్రమాలను స్పీకర్ సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేసినట్లు ప్రకటించారు. శనివారం సభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష బెంచ్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి తమ ఇద్దరు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని నిరసించారు. ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభలో మాట్లాడేందుకు ప్రతిపక్ష నేతకు స్పీకర్ అనుమతి నిరాకరించడాన్ని బీజేపీ శాసన సభ్యులు తీవ్రంగా నిరసించారు. సభా వేదికపై ప్రతిపక్ష నేతను అగౌరవపరిచారని ఆరోపించారు. ఈ క్రమంలో పదే పదే విజ్ఞప్తి చేసినప్పటికీ సభలో విపక్షాల నినాదాలు కొనసాగించారు. అయితే ఈ విడత సమావేశాలు ముగిసేంత వరకు సస్పెన్షన్ ఉత్తర్వుల అమలు కొనసాగుతుందని స్పీకర్ స్పష్టం చేశారు.

మానసిక రుగ్మత ప్రకటన తొలగింపు

ప్రతిపక్ష నేత జయ నారాయణ్ మిశ్రాపై బీజేడీ ఎమ్మెల్యే అరుణ్ సాహు చేసిన వ్యాఖ్యలను స్పీకర్ ప్రమీలా మల్లిక్ తొలగించారు. అరుణ్ సాహు ప్రకటనపై సభలో దుమారం చెలరేగింది. గురువారం 5టీ కార్యదర్శి పర్యటనలకు సంబంధించి సభలో ముఖ్యమంత్రి చేసిన ప్రకటనపై జయ నారాయణ్ మిశ్రా మరియు కాంగ్రెస్ శాసన సభ నాయకుడు నరసింగ మిశ్రాలు కొన్ని ప్రశ్నలు లేవనెత్తిన తర్వాత అరుణ్ సాహు అభ్యంతరకరంగా స్పందించారు. ఇద్దరు మిశ్రాలు ప్రభుత్వ 5టీ పాలనా శైలిని విమర్శిస్తున్నారు. 5టీ చొరవ కింద ప్రతిపక్ష ఎమ్మెల్యేలతో సహా అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి జరిగిందని అరుణ్ సాహు తెలిపారు. ఏదో 'మానసిక ఆరోగ్య రుగ్మత' ఉన్నట్లు కనిపిస్తోందని, మంచి మానసిక ఆరోగ్య పరిస్థితిలో సభకు రావాలని అందరినీ అభ్యర్థించినట్లు అరుణ్ సాహు తెలిపారు. దీంతో ఈ ప్రకటనను వ్యతిరేకిస్తూ బీజేపీ సభ్యులు వెల్ ఆఫ్ ద హౌస్‌లోకి దూసుకెళ్లి, 'మానసిక ఆరోగ్య రుగ్మత' వ్యాఖ్యని రికార్డు నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని స్పీకర్ చెప్పడంతో బీజేపీ సభలో గందరగోళం సృష్టించింది. అనంతరం సాయంత్రం 4 గంటల తర్వాత సభ సమావేశమైన తర్వాత వ్యాఖ్యలను అధికారిక రికార్డు నుంచి తొలగించినట్లు స్పీకర్ ప్రకటించారు.

నా ప్రాణాలకు ముప్పు ఉంది

● శాసనసభ ప్రతిపక్ష నాయకుడు జయ నారాయణ మిశ్రా



మీడియాతో మాట్లాడుతున్న జయ నారాయణ్ మిశ్రా

భువనేశ్వర్: సంబల్‌పూర్‌లోని తన ఇంటి ముందు ప్రణాళికాబద్ధంగా నిరసనలు జరుగుతున్నాయని, తన ప్రాణాలకు ముప్పు ఉందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, శాసన సభ ప్రతిపక్ష నాయకుడు జయ నారాయణ మిశ్రా శనివారం ఆరోపించారు. సంబల్‌పూర్ సర్క్యూట్ హౌస్‌లోకి బీజేడీ కార్యకర్తలు నా కోసం వెతుకుతున్నారు. నేను అక్కడ ఉండి ఉంటే, నన్ను చంపి ఉండేవారు. అసెంబ్లీ లోపలా, బయటా నేను అభద్రతా భావంతో ఉన్నాను. నేను రక్షణ కోరడం లేదు మరియు భద్రతా సిబ్బందిని ఫిరాయించాను. కానీ నాకు లేదా నా కుటుంబానికి ఏదైనా హాని జరిగితే దానికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బాధ్యత వహిస్తారని ఆయన మీడియా ప్రతినిధులతో అన్నారు. కొనసాగుతున్న వర్షాకాలం సమావేశాల్లో సభా కార్యక్రమాలను అడ్డుకునేందుకు అధికార బీజేడీ కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ ఆరోపణలపై బీజేడీ నేత ప్రతాప్ కేశరీ దేవ్ స్పందిస్తూ ఇదో రాజకీయ నాటకంగా అభివరించారు. సభలో కాషాయ పార్టీ సభ్యుల వికృత ప్రవర్తన మరియు స్పీకర్‌పై వారు చూపిన అగౌరవం నుంచి దృష్టిని మళ్లించే ప్రయత్నం అన్నారు.

అన్ని ద్వారాలను ఇప్పుడు తెరవలేం

● న్యాయశాఖ మంత్రి జగన్నాథ సరక

భువనేశ్వర్: రాష్ట్రంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన పూరీ జగన్నాథ ఆలయ నాలుగు ద్వారాలను ఇప్పుడు తెరవలేమని, ప్రస్తుతం కొనసాగుతున్న హెరిటేజ్ కారిడార్ పనులు పూర్తయ్యే వరకు ప్రస్తుత పరిస్థితి యథాతథంగా కొనసాగుతుందని న్యాయశాఖ మంత్రి జగన్నాథ సరకా శనివారం అసెంబ్లీలో తెలిపారు. సుందర్‌గడ్ ఎమ్మెల్యే కుసుమ్ టెటె లేవనెత్తిన సాధారణ వర్గం ప్రశ్నకు సమాధానమిస్తూ, కోవిడ్-19 ఆంక్షల కారణంగా 12వ శతాబ్దపు శ్రీమందిరం నాలుగు ద్వారాలు 2020 సంవత్సరం మార్చి 20 నుంచి మూసివేయబడ్డాయి. తర్వాత భక్తుల ప్రవేశాన్ని అనుమతించడానికి రెండు ద్వారాలు తెరిచారని మంత్రి జగన్నాథ సరకా సభలో తెలియజేశారు. శ్రీమందిర్ పరిక్రమ ప్రాజెక్ట్ ఇంకా కొనసాగుతున్నందున, ఈ సమయంలో ఆలయం నలువైపుల అన్ని ద్వారాలను భక్తుల కోసం తెరవలేమని స్పష్టం చేశారు. ప్రారంభంలో భక్తులను సింహ ద్వారం నుంచి మందిరంలో ప్రవేశించేందుకు అనుమతించారు. నాలుగు ద్వారాల గుండా ప్రవేశాన్ని అనుమతించాలని భక్తులు మరియు రాజకీయ పార్టీల నుంచి పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ఈ సంవత్సరం జూలై నెలలో పశ్చిమ ద్వారం స్థానికుల కోసం మాత్రమే తెరవబడింది. యాత్రికుల సౌకర్యార్థం, నిష్క్రమణ ప్రయోజనం కోసం ఉత్తర ద్వారం ఉపయోగించబడుతుంది. అక్టోబర్ నాటికి పూర్తి చేయాలనుకున్న హెరిటేజ్ కారిడార్ పనులు పూర్తయ్యేవరకు మిగతా రెండు గేట్లను మూసి ఉంచాలని ఆగస్టు నెలలో ఆలయ కార్యనిర్వాహక కమిటీ నిర్ణయించిందని మంత్రి సమాధానంలో పేర్కొన్నారు.

సత్కారాలు బాధ్యతలు పెంచుతాయి



యువతకు అవార్డులు ప్రదానం చేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: సత్కారాలు ప్రతి ఒక్కరికీ బాధ్యతలు పెంచుతాయని రాజ్యసభ సభ్యుడు ముజిబుల్లా ఖాన్ (మున్నా భాయి) అన్నారు. జట్నీ యూత్ ఫెడరేషన్ పలు రంగాల్లో రాణిస్తున్న యువతను ఏటా ప్రత్యేకంగా సత్కరిస్తుంది. దీనిలో భాగంగా 7వ యువ సమ్మాన్ మహోత్సవం పురస్కరించుకుని ఈ ఏడాది వివిధ రంగాలకు చెందిన ఆరుగురు యువతకు యువ సమ్మాన్ అవార్డులు ప్రదానం చేశారు. వీరిలో సాయి సిమపుల్ (మేటి విద్యార్థి), అబ్దుల్ అసీఫ్ (స్వచ్ఛంద సేవకుడు), డాక్టర్ సునీల్ కుమార్ రౌత్రాయ్ (వైద్య నిపుణుడు), బిరాంచి నారాయణ సెఠి (రాజకీయ సమన్వయం), దినేష్ కుమార్ మంగరాజ్ (సంఘ సేవ), డాక్టర్ ఉమాకాంత పట్నాయక్ (సాంఘిక సంస్కరణ, మార్గదర్శి) ఉన్నారు. నిర్వాహక సంస్థ కార్య నిర్వాహక అధ్యక్షుడు రవీంద్ర నాథ్ మహాకుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కార్మిక సంక్షేమ బోర్డు అధ్యక్షురాలు శ్రీమయి మిశ్రా తదితరులు హాజరయ్యారు. యువతను పోత్సహించేందుకు జట్నీ యూత్ ఫెడరేషన్ ఏటా యువ సమ్మాన్ పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమని ఖుర్దా జిల్లా బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, జట్నీ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బిభూతి భూషణ్ బల్బంత్రాయ్ అన్నారు.

శౌర్యజాగరణ యాత్ర ప్రారంభం



శౌర్యజాగరణ యాత్రలో హనుమకు హారతులిస్తున్న మహిళలు

కవిటి: మండలంలోని సీహెచ్ కపాసుకుద్దిలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శౌర్యజాగరణ రథయాత్ర శనివారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన మహిళలు పెద్దసంఖ్యలో ఆంజనేయ స్వామికి రథంలో విశేషపూజలు చేసి మంగళ హారతులు సమర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురు వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కాయ భీమసేన్, బల్లెడ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

ఆమదాలవలస రూరల్: మండలంలో దన్నానపేట గ్రామం సమీపంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.నారాయణరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో మంగళవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో గల కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈసీఈ, మెకానికల్ బ్రాంచ్‌ల్లో మిగిలిపోయిన సీట్లు భర్తీ చేయడానికి స్పాట్ అడ్మిషన్లు కోరుతున్నట్లు చెప్పారు. ఈ అడ్మిషన్లు పొందే విద్యార్థులు నిర్ణీత ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు వర్తించవని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా నేడు స్వచ్ఛతా హీ సేవ

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వచ్ఛతా హీ సేవ-2023, స్వచ్ఛతా శ్రమదాన్ పేరుతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా పరిసరాల పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. జిల్లాలో శ్రమదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతాయని రాజకీయ ప్రముఖులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వా మ్యం అవుతారని శనివారం తెలిపారు. వారితో పాటు జిల్లాలోని యువతీ, యువకులు, సాధారణ ప్రజానీకం, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఈ కార్యక్రమంలో పాలుపంచు కోవాల ని విన్నవించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల వేదికగా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించే కార్యక్రమాల ఫొటోలను ప్రజలు http:swachhataseva.com పోర్టల్‌లో అప్‌లోడ్ చేయవచ్చని సూచించారు. ఉత్తమ సేవకులకు స్థానిక సర్పంచి, కార్యదర్శుల ద్వారా ప్రశంసాపత్రాలు అందుతాయని వివరించారు.

నేడు ఆదిత్యుని మూలవిరాట్టుపై కిరణ స్పర్శ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం గర్భాలయంలో ఉన్న మూలవిరాట్టుపై తొలి సూర్యకిరణాలు తాకనున్నాయి. ఆదివారం వేకువజామున 6 గంటల సమయంలో సూర్యోదయ తొలి కిరణాలు నేరుగా స్వామి సన్నిధిని చేరుకోనున్నాయి. ఈ అద్భుత క్షణాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు అరసవల్లి క్షేత్రానికి తరలిరానున్నారు. ఈ మేరకు ఆలయ ధ్వజస్తంభం నుంచి సూర్యకిరణ స్పర్శను చూసేలా ప్రత్యేక బారికేడ్లను ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. అయితే ఆకాశం మేఘావృతం అయితే కిరణ దర్శనం కనిపించదని, అలాగే సోమవారం కూడా ఇలాంటి దర్శనానికి భక్తులకు అవకాశం ఇవ్వనున్నట్లుగా వివరించారు.

'గ్రీన్ ఎనర్జీ వైపు అడుగేద్దాం'



విద్యుత్ వాహనాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న కమిషనర్ ఓబులేసు

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేసి విద్యుత్ వాహనాలను వినియోగిద్దామని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు అన్నారు. ఈ మేరకు అందరి చేతా ప్రతిజ్ఞ చేయించారు. గో-ఎలక్ట్రిక్, గో- గ్రీన్ నినాదంతో నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో నెడ్‌క్యాప్ ఏర్పాటు చేసిన విద్యుత్ వాహనాల ప్రదర్శన, అవగాహన కార్యక్రమాన్ని కమిషనర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. నెడ్‌క్యాప్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలపాన త్రినాథ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ వాహనాన్ని నడిపి పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా విద్యుత్ వాహనాలను వినియోగించాలని ఓబులేసు ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ కూడా గ్రీన్ ఎనర్జీ వినియోగం పెంచేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలంటే, చార్జింగ్ స్టేషన్ల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. **నెడ్‌క్యాప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇంధన వీర సుబ్రహ్మణ్యం** మాట్లాడుతూ కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మన రాష్ట్రంలో సుమారు 1.30 కోట్ల వాహనాలు ఉన్నాయని, వీటిలో అత్యధికంగా ద్విచక్రవాహనలేనని చెప్పారు. వీటి వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతింటోందని అన్నారు. విద్యుత్ వాడకాల వినియోగం వల్ల పర్యావరణ పరిరక్షణ జరగడమే కాకుండా, రవాణా ఖర్చు గణనీయంగా తగ్గుతుందని అన్నారు. వాహనాల ఖరీదు కంపెనీ, మోడల్ బట్టి రూ.1.30లక్షల నుంచి 1.85 లక్షలు వరకు ఉంటుందన్నారు. ఈ వాహనాలు ఇంటి వద్దనే చార్జింగ్ చేసుకోవచ్చని చెప్పారు. ఒక సారి చార్జింగ్‌కు 4 లేదా 5 గంటలు పడుతుందని, కరెంటు ఖర్చు రూ.20తో 100 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల వాడుక ద్వారా పొదుపు చేసిన ధనం, రుణ వాయిదాల చెల్లింపునకు సరిపోతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు 'ఈవిఎస్ఆర్ఈడిక్యాప్.ఇన్' పోర్టల్ ద్వారా అప్లై చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ సునీతా, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గంగు శారద, సీపాన రామారావు, తదితరులు పాల్గొన్నారు.

'స్పాట్ అడ్మిషన్లు సద్వినియోగం చేసుకోవాలి'

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోఈ నెల 3వ తేదీన నిర్వహించే స్పాట్ అడ్మిషన్లు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావు చెప్పారు. కళాశాలలో సీట్ల వివరాలను శనివారం వెల్లడించారు. సివిల్ బ్రాంచ్‌లో ఎస్సీ మహిళా విభాగంలో ఒకటి, ఈడబ్ల్యూఎస్‌లో ఆరు, ట్రిపుల్‌ఈలో మహిళలు అన్ రిజర్వ్‌డ్ ఒకటి, బీసీబీ ఒకటి, ఈడబ్ల్యూఎస్ 3, మెకానికల్‌లో ఈడబ్ల్యూఎస్‌లో 4, సీసీపీలో ఈడబ్ల్యూఎస్ 3, ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో 22 ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వచ్చిన దరఖాస్తుల్లో మెరిట్, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. స్పాట్ అడ్మిషన్లకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు వర్తించవని అన్నారు. సాంకేతిక విద్యా శాఖ నిబంధనల మేరకు పూర్తిస్థాయిలో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

'ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి'



ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు అందరూ సమస్యల పరిష్కారానికి సమైక్యంగా పోరాడాలని ఏపీ ఎన్జీవో నాయకులు హనుమంతు సాయిరాం పేర్కొన్నారు. శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం ముందు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ మాట్లాడుతూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ పనితీరు మార్చుకోవాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని, జీపీఎస్‌ను వెనక్కి తీసుకోవాలని కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



పర్లాకిమిడి: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జెమ్స్ సిబ్బంది



జయపురం: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తదాగత రౌత్

జయపురం: స్థానిక జగదాత్రిపూర్ పట్టణ వైద్య కేంద్రం ఆధ్వర్యంలో గొడియదొబాసాహి సభాగృహంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు 1,011 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రక్తహీనత, మధుమేహం, బీపీ తదితర వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విభాగ సూపర్‌వైజర్ సత్యనారాయణ పాత్రో, సంజయ స్వైయ్, లింగరాజ్ పాఢీ తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ మెడికల్ ఆస్పత్రి, జిల్లా కోర్టు ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ శనివారం ప్రారంభించారు. శిబిరంలో కంటి, గైనిక్ డాక్టర్లతో పాటు హృద్రోగ నిపుణులు డాక్టర్ ఎల్.వి జయకుమార్, కార్డియాలజిస్టు ఎం.సంతోష్ బాబు తదితరులు రోగులను పరీక్షించారు. సుమారు 218 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. జిల్లా కోర్టు అధికారులతో పాటు జువైనైల్ కోర్టు మేజిస్ట్రేట్ సత్యవ్రత రోణా, చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నరోత్తమ శెఠి, జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ కార్యదర్శి రబినారాయణ బెహరా, బార్ అసోసియేషన్ సభ్యులు సైతం పరీక్షలు చేయించుకున్నారు.

రొయ్యల చెరువులపై విచారణ



ఆక్వా, వ్యవసాయ రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ, మత్స్యశాఖాధికారులు

ఇచ్ఛాపురం రూరల్: పెద్ద లక్ష్మీపురం గ్రామం వద్ద అక్రమంగా రొయ్యల చెరువులు ఏర్పాటు చేయడం వల్ల వ్యవసాయ, ఉద్యానవన పంటలు నాశనం అవుతున్నాయంటూ ఇటీవల 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో చేసిన ఫిర్యాదుకు జిల్లా అధికారులు స్పందించారు. శనివారం వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ పీవీ శ్రీనివాసరావులు రొయ్యల చెరువులు, వ్యవసాయ పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఆక్వా, వ్యవసాయ రైతులతో విడివిడిగా మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు విలేకరులతో మాట్లాడుతూ ఇరు వర్గాల వారి అభిప్రాయాలను తీసుకుని తయారు చేసిన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆక్వా, వ్యవసాయ రైతులు అప్పటి వరకు సమన్వయంతో ఉండాలని సూచించారు. తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్, వ్యవసాయశాఖ ఏడీ జగన్మోహనరావు, వ్యవసాయాధికారి బి.నరసింహమూర్తి, మత్స్యశాఖ ఏడీ సత్యనారాయణ, ఎఫ్‌డీఓ రవికుమార్, పీఎఫ్ఏ ముబిన్ అబ్దుల్లా, వీఆర్వోసంతోష్, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, బుద్ధ కళ్యాణ్ ఉన్నారు.

'ఆడ, మగ భేదం ఉండకూడదు'



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శాంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమాజంలో ఆడ, మగ అనే లింగ భేదం ఉండరాదని రెవెన్యూ డివిజనల్ అధికారి బి.శాంతి అన్నారు. శ్రీకాకుళం ఆర్డీఓ చాంబర్ లో లింగ నిష్పత్తి, లింగ నిర్ధారణ చట్టంపై శనివారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరు పర్యవేక్షించాలని, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.సన్యాసినాయుడు ప్రభుత్వ వైద్య కళాశాలలో (రిమ్స్) యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లాలోని మూడో అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టు జడ్జి పి.భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, ర్యాగింగ్ పాల్పడితే శిక్షలు తప్పవని తెలిపి యాంటీ ర్యాగింగ్ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు రిమ్స్ కాలేజీ ప్రిన్సిపాల్ రవి వెంకటాచలం వైస్ ప్రిన్సిపల్ కె.కోటేశ్వరరావు, న్యాయవాదులు అన్నెపు సత్యనారాయణ గేదెల ఇందిరా ప్రసాద్, సోషల్ వర్కర్ మంత్రి వెంకటస్వామి సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రసన్న పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్ పైన సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు శనివారం తెలిపారు. పికెట్ డ్యూటీ కానిస్టేబుల్ విచారణ చేయగా అతను యాచకుడని మాత్రమే తెలిసిందన్నారు. వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అతని బంధువులు ఎవరైనా తెలిస్తే వెంటనే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు.

గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం


సూరిమల్లి సూర్యనారాయణ మృతదేహం

వంగర: మండల పరిధి కొండచాకరాపల్లి సమీపంలో సెప్టెంబర్ 29న సువర్ణముఖి నదిలో గల్లంతైన సూరిమల్లి సూర్యనారాయణ మృతదేహం శనివారం పోలీసులు గుర్తించారు. కొండచాకరాపల్లి, కొప్పర, గీతనాపల్లి సమీపంలో పోలీసులు, కుటుంబ సభ్యులు గాలించారు. చివరికి గీతనాపల్లి వద్ద శివాలయం ఆవరణలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు గొల్లుమన్నారు. అనంతరం ఎస్‌ఐ ఆర్.జనార్ధన ఆధ్వర్యంలో మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాలకొండ రూరల్: సిరికొండ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సవర లక్ష్మణరావు(30) మృతి చెందాడు. పాలకొండ ఇన్‌చార్జ్, సీతంపేట ఎస్‌ఐ నీలకంఠం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతంపేట మండలం అడ్డాకులగూడకు చెందిన ఈయన తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై పాలకొండ వస్తుండగా సిరికొండ వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. వాహనంపై నుండి కిందపడి తీవ్ర గాయాల పాలైన లక్ష్మణరావు ఘటనా స్థలంలోనే మరణించారు. పోలీసులు కేసు నమోదు చేసారు.

ముమ్మరంగా దర్యాప్తు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామంలో డ్వాక్రా సంఘాలకు సంబంధించిన అవకతవకలపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మెప్మా టీఎంసీ ఎస్వీ రత్నం ఆధ్వర్యంలో రికార్డులు శనివారం పరిశీలించారు. ఈ పరిశీలనలో 2019లో నవదుర్గ గ్రూపులో రూ.2.25 లక్షలు, లలితాంబ గ్రూపులో రూ.2.36 లక్షలు, అన్నమ్మపేరంటాలు గ్రూపునకు సంబంధించి రూ.2.70 లక్షల మేర తేడాలను గమనించామని టీఎంసీ వెల్లడించారు. రుణాలు చేసే ముందు తీర్మానాలు ఉండాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా అలా లేవన్నారు. అయితే ఈ రుణాలు తీసుకున్నారా అని సభ్యులు వద్ద ప్రస్తావించగా వారంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఈ మొత్తాన్ని తాము తీసుకోలేదని, ఆ డబ్బులు విషయం కూడా మాకు తెలియదని, అప్పటి నుంచి బ్యాంకు పుస్తకాలు కూడా ఆర్పీ ఉమాదేవి తన వద్దే ఉంచుకుందని అధికారుల వద్ద వాపోయారు. ఈ మొత్తాలకు తీర్మానాలు లేకుండా లోన్లు జరిగినట్లు గుర్తించిన అధికారులు ఆర్పీని ప్రశ్నించారు. ఇందుకు స్పందించిన ఆర్పీ తనకు పది రోజులు సమయం కావాలని కోరిందని టీఎంసీ తెలిపారు. దర్యాప్తులో సీఓ దానాలమ్మ ఉన్నారు.

బాల శాస్త్రవేత్తలను తయారుచేద్దాం


మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారిణి, జిల్లా సైన్స్ అధికారులు

పాలకొండ రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికితీసి వారిని బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని ఉప విద్యాశాఖాధికారిణి ఆర్.విజయకుమారి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఆప్‌కాస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన డివిజన్ స్థాయి ఒరియంటేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ విద్యార్థులచే ప్రాజెక్టులు సిద్ధం చేయాలన్నారు. త్వరలో జరగనున్న జిల్లా స్థాయి ఒరియంటేషన్‌లో ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను విడుదల చేసారు. కార్యక్రమంలో జిల్లా ఆప్‌కాస్ట్ కోఆర్డినేటర్ పి.రామకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి లక్ష్మణరావు, అకడమిక్ కోఆర్డినేటర్ కె.అయ్యప్ప, రిసోర్స్‌పర్సన్లు సతీష్‌రాజు, సురేష్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుంటే తస్మాత్...


మందులు

- అనధికారకంగా మందులు విక్రయించే వారిపై ఉక్కుపాదం
- ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న ఔషధ నియంత్రణ అధికారులు
- ఇప్పటివరకు 41 కేసులు నమోదు
- జిల్లాలో లైసెన్స్ కలిగిన మందులు దుకాణాలు 800

విజయనగరం ఫోర్ట్: తెర్లాం మండలం నెమలాం గ్రామంలో ఓ వ్యక్తి లైసెన్సు లేకుండా మందులు విక్రయిస్తున్నట్టు ఔషధ నియంత్రణ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో సెప్టెంబర్ 22న ఔషధనియంత్రణ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆ వ్యక్తి ఇంట్లో రూ.30 వేలు విలువ చేసే మందులను సీజ్ చేసారు.

ఈ ఒక్క వ్యక్తిపైనే కాదు. లైసెన్స్ లేకుండా, నాణ్యత లేని మందులు విక్రయించే అనేక మందిపై ఔషధ నియంత్రణ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. అధిక ధరకు మందులు విక్రయించే వారిపైన కేసులు నమోదు చేసి అక్రమార్కులపై కొరడా ఝుళిపిస్తున్నారు. జిల్లాలో కొంతమంది లైసెన్స్ లేకుండా మందులు అక్రమంగా నిల్వ చేసి గుట్టుగా విక్రయిస్తున్నారు. కొన్ని మందుల దుకాణాల్లో నాణ్యత లేని మందులను కాసులు కోసం ఆశపడి విక్రయిస్తున్నారు. మరి కొంతమంది మందులను అధిక ధరకు విక్రయిస్తున్నారు. కొంతమంది తమ ప్రొడక్టులతో జబ్బులు తగ్గించేస్తామని ప్రజలను మోసం చేస్తున్నారు. ఇటువంటి వాటిన్నింటికి అడ్డుకట్టే వేసే విధంగా ఔషధ నియంత్రణ శాఖ చర్యలు చేపడుతుంది.

41 కేసులు నమోదు

జిల్లాలో ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఈ ఏడాది ఇప్పటి వరకు 41 కేసులు నమోదు చేశారు. ఇందులో 30 కేసులు కోర్టులో ఉన్నాయి. ఇందులో నాణ్యత లేని మందులు విక్రయించే కేసులు 17 ఉన్నాయి. అదే విధంగా లైసెన్స్ లేకుండా మందులు విక్రయించే కేసులు 9, మందులను అధిక ధర నిర్ణయించిన కంపెనీలపై 3 కేసులు, నకిలీ ప్రొడెక్టుతో జబ్బు నయం చేస్తున్న ఏజెన్సీపై ఒక కేసు ఉన్నాయి. 11 కేసులు ఇన్విస్టిగేషన్ (విచారణ) స్థాయిలో ఉన్నాయి. వీటిలో నాణ్యత లేని మందులపై 8 కేసులు, లైసెన్సు లేకుండా మందులు విక్రయించిన వారిపై 3 కేసులు నమోదయ్యాయి.

> ప్రజారోగ్యానికి సంబంధించి వైద్యులు రాసే మందుల కొనుగోలులో జరుగుతున్న అక్రమాలకు ఔషధ నియంత్రణ అధికారులు చెక్ పెడుతున్నారు. లైసెన్స్ లేకుండా నడుపుతున్న దుకాణాలు.. అధిక ధరలకు మందులు విక్రయించే దుకాణాలపై నిఘా పెట్టారు. దాడులు చేస్తున్నారు. తగు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతి నెలా పరీక్షకు 14 శాంపిల్స్

జిల్లాలో ఇద్దరు ఔషధ నియంత్రణ అధికారులు ఉన్నారు. వీరిలో విజయనగరంలో ఒకరు, బొబ్బిలిలో ఒకరు ఉన్నారు. జిల్లాలో 800 మందుల దుకాణాలు ఉన్నాయి. వీరు ప్రతి నెల మందుల దుకాణాల నుంచి శాంపిల్స్ తీస్తారు. ఇద్దరు అధికారులు చెరో 7 చొప్పున 14 శాంపిల్స్ తీసి విజయవాడలో ఉన్న డ్రగ్ కంట్రోల్ ల్యాబొరేటరీకి పంపించి నాణ్యత పరీక్షిస్తారు. నాణ్యత లేని మందుల కంపెనీలపై కేసులు నమోదు చేస్తారు.

చర్యలు తప్పవు..



జిల్లాలో ఎక్కడైనా లైసెన్స్ లేకుండా మందులు అక్రమంగా విక్రయించినా, నాణ్యత లేని మందులు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎంఆర్‌పీకి మించి మందులు విక్రయించినా చర్యలు తీసుకుంటాం. ప్రతి నెల మందుల దుకాణాలను, ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నాం. – రజిత, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ

విద్యుత్ సబ్ స్టేషన్‌లో భారీ పేలుడు

- పేలిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్
- పరుగులు తీసిన లైన్‌మన్


తెగిపడిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉండే విద్యుత్ పరికరం

వీరఘట్టం/పాలకొండ: వీరఘట్టం-పాలకొండ మండలాల్లోని పలు గ్రామాలను అనుసంధానం చేస్తూ నవగాం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి భారీ పేలుడు సంభవించడంతో షిఫ్ట్ లైన్‌మన్‌తో పాటు అక్కడ సిబ్బంది ప్రాణ భయంతో పరుగులు తీసారు. ఎం.వీ.పురం వద్ద ఉన్న ఉపరితల రక్షిత పథకానికి విద్యుత్ సరఫరా అందిస్తున్న ఫీడర్‌పై ఉన్న లింబ్(పింగాణీ పరికరం పెద్దది) పగిలిపోయి పింగాణీ ముక్కలు దూసుకురావడంతో అక్కడ ఉన్న సిబ్బంది పరుగులు తీసారు. లింగ్ బ్లాస్ట్ అయినపుడు బాంబు పేలినట్లు పెద్ద శబ్దం రావడంతో సమీపంలో ఉన్న వారంతా ఒక్కసారిగా ఏం జరిగిందోనని భయాందోళనకు గురయ్యారు. అనంతరం కొద్ది నిముషాల వ్యవధిలో కరెంట్ ఆయిల్‌తో ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బ్లాస్ట్ కావడంతో పెద్ద మంటలు చెలరేగాయి. కరెంట్ ఆయిల్ చెల్లాచెదురుగా పడడంతో యార్డ్‌లో భయానకమైన పరిస్థితి నెలకొంది. అనంతరం పాలకొండ నుండి వచ్చే విద్యుత్ సరఫరాను నిలిపివేసి ట్రాన్స్‌కో సిబ్బంది పరిశీలించారు. సబ్ స్టేషన్ నుంచి వివిధ ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఇచ్చే సమయంలో లింబ్‌తో పాటు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో భయంతో పరుగులు తీసారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సంకల్ప సప్తాహను ప్రారంభించిన పీఎం

- అక్టోబర్ 3నుండి 9వరకు పలు కార్యక్రమాలు


వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం: సంకల్ప సప్తాహ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం వర్చువల్ విధానంలో ప్రారంభించగా.. కలెక్టర్ కార్యాలయం నుండి కలెక్టర్ నిశాంత్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు వీక్షించారు. సంకల్ప సప్తాహ కార్యక్రమంలో భాగంగా దేశంలో ఆశావహ జిల్లాల్లో ఎంపిక చేసిన బ్లాకుల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఆ ప్రాంత వాసులను ప్రధాన జీవన స్రవంతిలోకి తీసుకురావడం, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడం జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాలలో ఉద్యోగ సేవలు అందించడం గొప్ప వరంగా భావించాలన్నారు. వెనుకబడిన ప్రాంతాలలో మంచి పాలనాదక్షతవున్న అధికారులు, సిబ్బంది అవసరమన్నారు. ఆశావహ జిల్లాగా ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలో భామిని మండలాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా అక్టోబరు 3 నుండి 9వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మూడు జిల్లాల్లో మూడు బ్లాకులను ఎంపిక చేయగా భామిని మండలం ఎంపిక కావడం గమనార్హం. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, పీఆర్ ఈఈ జి.మల్లిఖార్జున, ఇన్‌చార్జ్ డీపీఓ నాగభూషణరావు, డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్, డీఏఓ కె.రాబర్ట్ పాల్, సీఈఓ పి.వీరరాజు, మజ్జి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

సారా రవాణాకు అడ్డుకట్ట వేస్తాం..


పోలీసు అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి

- జిల్లా స్థాయి అధికారుల సమావేశంలో ఎస్‌ఈబీ డీసీ శ్రీరామచంద్రమూర్తి

పార్వతీపురం టౌన్: సారా రవాణా అమ్మకాలను పూర్తి స్థాయిలో నిర్మూలిస్తామని ఎస్‌ఈబీ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. స్థానిక ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అధికారులతో జిల్లా అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ ఆధ్వర్యంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో ఎక్కువశాతం గిరిజన గ్రామాలు, కొన్ని ప్రాంతాల్లో ఒడిశా సరిహద్దు ప్రాంతాలు ఉండడం వల్ల ఒడిశా రాష్ట్రం నుంచి సారా రవాణా అవుతుందన్నారు. రవాణా నిర్మూలనకు పూర్తి చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టపరిచామన్నారు. జిల్లాలో ఐదు ఎస్‌ఈబీ స్టేషన్లలో సిబ్బంది చాకచక్యంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతీ రోజు కేసులు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకుంటున్నామన్నారు. రానున్న ఎన్నికల తరుణంలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. ముందస్తుగా పాత ముద్దాయిలను గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పార్వతీపురం పట్టణంలో సారా నిల్వ కేంద్రాలను గుర్తించి ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. సమావేశంలో సీఐలు ఉపేంద్ర, గోపాలకృష్ణ, కృష్ణమూర్తి, ఈశ్వరరావు, పీడీ ప్రసాద్, ఎస్‌ఐలు నాగభూషణ్, రాజశేఖర్, నాగభూషణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మరో ఇద్దరు టీచర్లు, హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

- ఇద్దరు ఎంఈఓలకు, కస్పా స్కూల్ హెచ్‌ఎంకు చార్జ్ మెమోలు
- స్కూల్ కాంప్లెక్స్ విధుల మధ్యలో గైర్హాజరైన పది మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు

విజయనగరం అర్బన్: విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ పర్యటనలో తనిఖీ చేసిన ఆర్‌కే ప్రాథమిక పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు శనివారం ఆదేశాలిచ్చినట్లు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఆ రోజు తనిఖీలో నాలుగవ తరగతి విద్యార్థుల మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల వర్క్ బుక్ పరిశీలనలో ఆయన గుర్తించిన అభ్యసన సామర్థ్యాలు లేని విద్యార్థులపై నిర్లక్ష్య వైఖరితో పాటు బోధనాపరమైన పలు అంశాలలో సంబంధిత టీచర్ల తీరుపై ప్రవీణ్ ప్రకాశ్ తీవ్రంగా అసంతృప్తి చెందిన విషయం తెలిసిందే. పాఠశాల నిర్వహణ లోపాలు కారణంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కూడా సస్పెండ్ చేసారు. అదే విధంగా ప్రవీణ్ ప్రకాశ్ పర్యటనలో తనిఖీ చేసిన స్కూల్ నిర్వహణ బాగోలేదని కస్పా స్కూల్ ప్రధానోపాధ్యాయునికి చార్జ్ మెమో ఇచ్చారు. రెండు స్కూళ్ల పర్యవేక్షణ లోపాల కారణంగా విజయనగరం మండల ఇద్దరు ఎంఈఓలకు కూడా చార్జ్ మెమోలు అందజేసారు. ఇదిలా ఉండగా జిల్లాలోని స్కూల్ కాంప్లెక్స్ విధులపై నిర్లక్ష్యంగా గైర్హాజరైన 10 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు పంపారు. వీరిలో నలుగురు గైర్హాజరు కాగా, ఆరుగురు ఉపాధ్యాయులు మధ్యాహ్నం పూట మధ్యలో గైర్హాజరయ్యారని డీఈఓ తెలిపారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు శరణ్య


రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన శరణ్య

వీరఘట్టం: రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు బిటివాడ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని గార శరణ్య ఎంపికైనట్లు పీడీ వండాన రాజేంద్ర తెలిపారు. శనివారం జరిగిన ఈ పోటీల్లో అండర్-17 విభాగంలో ఎంపికైనట్లు తెలిపారు. నవంబర్ నెలలో పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. హెచ్‌ఎం సి.హెచ్.రత్నాకరరావు, పాఠశాల సిబ్బంది శరణ్యను అభినందించారు.

ఐసీఏఆర్(పీజీ)లో ఆశా ప్రతిభ


ఐసీఏఆర్‌లో ర్యాంకు సాధించిన ఆశా

వేపాడ: మండలంలోని అరిగిపాలెం గ్రామానికి చెందిన తొండవరపు ఆశాకు(ఐసీఏఆర్) ఇండియన్ కౌన్సిల్ ఆన్ అగ్రికల్చరల్ రీసెర్చ్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 15వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 6వ ర్యాంకు సాధించింది. ఆశా పదో తరగతి తాటిపూడి ఏపీఆర్‌జేసీలో చదివి 9.3 గ్రేడ్ సంపాదించింది. ఇంటర్‌లో 97 శాతం మార్కులు, బీఎస్సీ అగ్రికల్చరల్‌లో 84శాతం, ఎంఎస్సీ(అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్సన్ ఎడ్యుకేషన్) 92 శాతం మార్కులు సాధించింది. ఆశాకు ఐసీఏఆర్‌లో మంచి ర్యాంకు రావడంతో తల్లిదండ్రులు టి.వెంకటరమణ, నాగరత్నంతో పాటు స్థానికులు అభినందించారు.

అథ్లెటిక్స్‌లో పతకాల పంట



జాతీయ పోటీలకు అర్హత సాధించిన జిల్లా క్రీడాకారులు

- రాష్ట్ర స్థాయి పోటీల్లో 40 పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు
- తెలంగాణలో జరగనున్న జాతీయ పోటీలకు 8 మంది ఎంపిక

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు గుంటూరు జిల్లాలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు 40 పతకాలు సాధించి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పారు. 5 రోజుల పాటు జరిగిన పోటీల్లో జిల్లా క్రీడాకారులు 12 బంగారు పతకాలతో పాటు 12 రజిత పతకాలు, 16 కాంస్య పతకాలు సాధించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8 మంది క్రీడాకారులు అక్టోబర్ మూడవ వారంలో తెలంగాణ రాష్ట్రంలోని హన్మకొండలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. జాతీయ పోటీలకు అర్హత సాధించిన వారిలో జి.లక్ష్మి, టి.లక్ష్మి, ఎం.హరీష్, ఎం.శారద, డి.ఉదయ్, బి.హరీష్, కె.సుశాంత్, బి.చాందినీ ఉన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించటంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను, జట్టుకు కోచ్ అండ్ మేనేజర్‌లుగా వ్యవహరించిన పి.సతీష్, ఎస్.శ్రీను, ఎ.లక్ష్మణ, పి.శేఖర్, లక్ష్మి, రెడ్డిలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ విద్యార్థులు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో స్కూల్ సిబ్బంది

భామిని: శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో భామిని మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ శనివారం తెలిపారు. కబడ్డీ, బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 9వ తరగతి విద్యార్థి వడ్డి దిలీప్, వివిధ కేటగిరీల్లో ప్రతిభ చూపిన కొత్తకోట దివ్యశ్రీ పాత్రో, సాయి గణేష్, నల్లకేవటి శాంతికుమారి, వాడాడ హారిక, ఎస్.జశ్వంత్, కె.జశ్వంత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై వారిని ప్రిన్సిపాల్ శివకుమార్, కోచ్ కె.సోమేష్, పీడీ శివరామప్రసాద్ అభినందించారు.

కోడి పందాలపై పోలీసుల దాడి

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామ సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందాలపై సీఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడి చేశారు. పందెం నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.16,300 నగదు, నాలుగు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఎమ్మెల్యేకు భూ హక్కు పత్రం అందజేత


ఎమ్మెల్యే శంబంగికి భూహక్కు పత్రం అందజేస్తున్న సర్వే సిబ్బంది

బొబ్బిలి: జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేతో రైతులు, భూయజమానులకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. శనివారం మండలంలోని రాముడువలస గ్రామంలో ఎమ్మెల్యే భూములకు సంబంధించి, భూ హక్కు పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భూముల రీసర్వే కార్యక్రమం కొన్ని దశాబ్దాల పాటు జరగలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అధునాతన పరికరాలతో భూముల రీసర్వే చేపడుతూ రైతుల మధ్య సు. దీర్ఘకాలంగా నెలకొన్న భూ సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు.

మెనూ అమలులో లోపాలుంటే చర్యలు


మధ్యాహ్న భోజనం రుచి చూసి, పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం మెనూ అమలులో ఎటువంటి లోపాలున్నా చర్యలు తీసుకునేందుకు వెనకాడేదిలేదని ఎంఈవో జె.త్రినాధరావు హెచ్చరించారు. మండలంలోని కాలంరాజుపేట యూపీ స్కూల్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగే ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇటీవల హత్యకు గురైన పాఠశాల ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ మాస్టారి మృతికి సంతాపం తెలియజేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మౌనం పాటించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథంలో మెనూ అమలును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూనే రుచి,శుచితో కూడిన భోజనం అందించాలని తెలిపారు.

ఆకట్టుకున్న పౌష్టికాహార ప్రదర్శన


పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది. అక్కడి పౌష్టికాహార స్టాల్స్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, సర్పంచ్ విజయబాబు, మండల ప్రత్యేకాధికారి, చీపురుపల్లి డీఎల్‌డీవో వి.లక్ష్మణరావు, ఎంపీడీవో శంబంగి రామకృష్ణ పరిశీలించారు. చిరుధాన్యాలు, అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహార పదార్థాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను వారు రుచి, చూశారు. ఆహార పదార్థాలు ఎంతో బాగున్నాయని అంగన్‌వాడీ సిబ్బందిని అభినందించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పరిహారం

- ఆర్‌డీవో శేషశైలజ

రామభద్రపురం: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తొలగించిన ఇళ్లకు పరిహారం ఇవ్వడం జరుగుతుందని ఆర్‌డీవో శేషశైలజ అన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా తారాపురం గ్రామంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఇళ్లను తొలగించాల్సి ఉండగా, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె ఆ గ్రామ ప్రజలు, పెద్దలతో శనివారం సమావేశమయ్యారు. కొన్ని రూ.లక్షలు పెట్టి, నిర్మించుకుని, దశాబ్దాలుగా నివశిస్తున్న తమ ఇళ్లను తొలగించి, అన్యాయం చేయవద్దని, ఎక్కడైనా తమకు ఇళ్ల స్థలాలు చూపి, వాటిలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని గ్రామస్తులు ఆర్‌డీవోను కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉండడం వల్లే తొలగించక తప్పడం లేదన్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి, ల్యాండ్ ఎక్విజియేషన్‌లో భాగంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అన్యాయం చేసే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోదన్నారు. గొంతమ్మ కోర్కెలు కోరకుండా న్యాయబద్ధమైన కోర్కెలు కోరాలని సూచించారు.